ISSN 2455-4111

సకుటుంబ ఆహ్లాద వీచిక

# చినుకు

మాసపత్రిక

జనవరి 2017
₹20/-



నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు

సకుటుంబ ఆహ్లాద వీచిక సమాచార దీపిక

చినుకు
మాసపత్రిక

సంపుటి : 12 సంచిక : 10

142

సంపాదకులు
నండూరి రాజగోపాల్
సెల్ : 98481 32208

1, జనవరి 2017

పేజీలు : 60

అసోసియేట్ ఎడిటర్
జనార్దన్ లంకె
సెల్ : 98485 36113

ఫీచర్స్ ఎడిటర్
సింగంపల్లి అశోక్ కుమార్
సెల్ : 98485 04649

పబ్లికేషన్ కన్సల్టెంట్
కె.రఘురామరాజు
సెల్ : 98493 50555

అలంకరణ
జనార్దన్

చందా వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | :రూ. | 200/- |
| 3 సంవత్సరాలకు | :రూ. | 500/- |
| 5 సంవత్సరాలకు | :రూ. | 800/- |
| జీవిత చందా | :రూ. | 5000/- |

U.S.A.- 30 $

చందాలు ఎం.ఓ.రూపంలో
'చినుకు' పబ్లికేషన్స్, విజయవాడ"
పేర ఈ క్రింది చిరునామాకు పంపవలెను.

26-7-11, గరికపాటివారి వీధి,
సురేష్ మూవీస్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ - 3.

E-mail : editor.chinuku@gmail.com
editor_chinuku@yahoo.com

# ఈ సంచికలో...

## శీర్షికలు


**నో కామెంట్** 11
చలసాని నరేంద్ర

**రాగరంజితం** 30
ఇంద్రగంటి జానకీబాల

**సప్తవర్ణ లేఖ** 43
విమల

**మావూరి మనుషులు** 47
బి.వి.రామిరెడ్డి

**ఓ మహాత్మా... ఓ మహర్షీ...!** 50
హెచ్చార్కె


## వ్యాసావళి


**శాంతి వనం** 19
మంచికంటి

**శివారెడ్డి కవితా శిల్పం** 23
డా॥తుర్లపాటి రాజేశ్వరి

**అమ్మ కడుపులో నేర్చిందే**
**అమ్మ భాష** 25
డా॥జి.వి.పూర్ణచందు

**జావళ్లీ ధ్వని** 36
రామతీర్థ

**కథానికా ప్రయాణంలో మైలురాయి**
**'దిద్దు బాటలు'** 40
మధురాంతకం నరేంద్ర

**ప్రియమైన నీకు** 58
ప్రియతమ్


## కవితలు


**అవి** 9
చిత్తలూరి సత్యనారాయణ

**ఆకు పచ్చని పాట** 9
పద్మావతి రాంభక్త

**అ(దృశ్యం)** 17
ఎమ్వీ రామిరెడ్డి

**మొండి గోడలు** 53
శ్రీమతి విశాలాక్షి దామరాజు


## కథలు


**మువ్వల సవ్వడి** 6
సలీం

**తరం అంతరం** 13
డా॥ ముక్తేవి భారతి

**ఎల్విర్ర అమండా** 27
డా॥ఎల్.ఆర్.స్వామి

**అంత రంగాలు** 32
డా॥దిలావర్

**కనపడని పంజరం** 38
డా॥దేవరాజు మహారాజు

**రక్త బీజం** 54
త్రిమూర్తి


## సమీక్షలు


**అవసరమైన కవిత్వం**
**'జ్ఞాన గుళికలు'** 29
యం.కె.సుగమ్‌బాబు


కథలకు బొమ్మలు : వెంకట్

### నవంబర్ 'చినుకు' ఉత్తమ రచయితలు

'చినుకు' డిశంబర్ సంచికలో ప్రచురించిన కథలలో ఉత్తమ కథగా పెమ్మరాజు మధు రచించిన 'జిహాది', కవితలలో ఉత్తమ కవితగా తాతా నారాయణమూర్తి రచించిన 'చీకటి' ఎన్నికయిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. ఉత్తమ కథకు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ ప్రకటించిన రెండువేల రూపాయల నగదు, ఉత్తమ కవితకు 'శ్రీమతి సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్' ప్రకటించిన రెండువేల రూపాయల నగదు పురస్కారాలు పంపబడతాయి. ఈ సందర్భంగా రచయితలను అభినందిస్తూ వీరేంద్రనాథ్‌గారికి, 'శ్రీమతి సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్' వారికి 'చినుకు' ధన్యవాదాలు తెలియజేస్తోంది.




## పత్రికోత్సాహం

**'చినుకు'** డిశంబర్ నెలలో ఒక గొప్ప ఉత్తరం చదివాక ఏదో వ్రాయాలనిపించింది. అది ఏదో తెలియటం లేదు. నా కళ్ళకి ఏడు రంగులు కనిపించలేదు. నల్లని మబ్బుల అంచున, కళ్ళని మిరిమిట్లు గొలిపే తెల్లని వెండి అంచు కనిపించింది. పిల్లల ఇళ్ళలో ఉండే చిన్నారుల ప్రతిభకి చప్పట్లు కొట్టాలా? వాళ్ళకి అవకాశం ఇచ్చిన పెద్దలకి దండం పెట్టాలా? ఆ విషయం, అట్లాంటివే మరికొన్ని మనకి తెలియ చెప్పటానికి శ్రమించే విమలమ్మ మళ్లీ శ్వరమ్మల భుజం తట్టాలా?

ఎవరికైనా భుజం తట్టాలంటే వాళ్ళ భుజాలు అందుకో గలిగిన ఎత్తులో నేనుండాలి కదా? ఆ ఎత్తులో నేను లేనప్పుడు నేను చేయ గలిగినది ఒక మనవి మాత్రమే.

అమ్మలూ! ఆ పెద్దలకి నా దండాలు ఆ పిల్లలకి నా చప్పట్లు తెలియచేయండి. ఇంకే మైనా నేను చెయ్యగలిగినది ఉంటే నాకు తెలియచేయండి. వీధుల్లో తిరిగే చిన్న భగవంతుడిని పోల్చుకోలేని చాలా మందిలో ఒకడిని.

– క వ న శర్మ, బెంగుళూరు




చినుకు

**పాఠకులకు, చందాదారులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు**

**నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు**

### విజయవాడ పుస్తక మహోత్సవంలో

చినుకు

జనవరి 1 నుండి 11 రోజులపాటు విజయవాడ స్వరాజ్య మైదానంలో జరుగుతున్న విజయవాడ పుస్తక మహోత్సవంలో స్టాల్ నెం. 270 లో 'చినుకు' దర్శనమిస్తోంది.

'చినుకు' పబ్లికేషన్స్ ప్రచురించిన అసంఖ్యాకమైన పుస్తకాలను పుస్తకాభిమానులు ఈ స్టాల్‌ను సందర్శించి తమకు కావలసిన పుస్తకాలను రాయితీ ధరలలో పొందవచ్చు.

అలాగే 'చినుకు' చందాదారులు తమ రెన్యువల్స్‌ను, కొత్తగా చేరేవారు కూడా ఈ స్టాల్‌లో తమ చందాలను కట్టవచ్చు.

పుస్తకాభిమానులు, పుస్తకప్రియులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరు. ఇతర వివరములకు 98481 32208, 98485 36113 సంప్రదించవచ్చు.

**చినుకు పబ్లికేషన్స్, గాంధీనగర్, విజయవాడ – 520 003**

# సంపాదకీయం

## గడిచిన గతుకుల సంవత్సరం...

**ఇది రాస్తున్న** సమయానికి డిమానిటైజేషన్ జరిగి సరిగ్గా ఏభై రోజులు. దేని కోసమైతే నోట్ల రద్దు జరిగిందని చెపుతున్నారో...ఆ అవినీతి కాని, ఆ నల్ల డబ్బుకాని, ఆ నకిలీ డబ్బుకాని ఎక్కడా ఆగలేదు. ఓ ఏభై గజాల స్థలం, ఒక చిన్న పెంకుటిల్లు, ఒక పురిపాక ఇచ్చే బోల్డంత భరోసాని ఇవాళ దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి మనుషులు కోల్పోయారు. భూమి విలువలు చంపేసి, నగదు పంపిణీ ఆపేసి, 'తాంబూలాలు ఇచ్చేసాను, తన్నుకు చావండి' అంటున్న ప్రభుత్వాన్ని ఏమి చేయాలి? సభ్యత్వ రూపంలో అధికార మిత్ర పక్షాల పార్టీ ఎకౌంట్‌లలో జమ అయిన కోట్ల రూపాయల గురించి అడగడానికి, అనడానికి కూడా ప్రయత్నించని ప్రభుత్వాన్ని ఏమనాలి? అసలు ఎన్నికలవగానే పార్టీ, ప్రభుత్వం వేరుగా ఉండలేని, వేరుగా ఉంచలేని ఈ వ్యవస్థను ఎలా మార్చాలి?

ప్రశ్నలు ఒక్క పక్క, సమస్యలు మరొక పక్క చేరి ఇవాళ భారతీయులని అల్లకల్లోలం చేస్తున్నాయి. రేపు అన్నది ఒక ప్రశ్నగా మారడానికి అవకాశం లేని బతుకుల్లో కూడా రేపుని ఒక కొశ్చన్ బ్యాంక్‌ని చేసిన ప్రభుత్వం గడచిన సంవత్సరాన్ని చేదుగా చేసింది. ప్రజల పక్షాన ఉండే ఏ నాయకుడైనా ప్రజలకు హాని జరగకుండా చూస్తాడు. యుద్ధంలో శత్రువులను చంపడం కన్నా మన వాళ్ళను బతికించుకోవడం, రక్షించుకోవడం ముఖ్యం. కాని దానికి పూర్తి వ్యతిరేకంగా జరిగింది.

వ్యక్తికి తన గురించిన ప్రచారం మీద, ప్రాభవం మీద ఆసక్తి పెరిగితే ఎంత దారుణమైన ఫలితాలు కనపడతాయో చెప్పడానికి గత కొన్ని నెలలుగా మన దేశంలో జరుగుతున్న సంఘటనలే ఋజువు. ఒక వ్యాపార లావాదేవి, ఒక వ్యాపార వేత్త మొత్తం ప్రభుత్వాన్ని నడిపించడమనేది ప్రపంచ దేశాలలో కనపడుతూనే ఉంటుంది. కాని ఇప్పుడు మనదేశంలో రాజకీయం వర్సెస్ వ్యాపారం కలిసి షికారు చేస్తున్నాయి. వ్యాపారస్తులు వర్సెస్ ప్రభుత్వ పెద్దలు కలిసి పాలన చేస్తున్నారు. కాబట్టి, గడిచిన సంవత్సర కాలంగా ప్రభుత్వాలు తీసుకున్న ప్రతి నిర్ణయం వెనుక మనకి ఈ సూక్ష్మం స్పష్టంగా కనపడుతుంది.

కాని ప్రతి దారికి ఒక గమ్యం ఉంటుంది. ప్రతి మలుపులోనూ ఒక సూచిక ఉంటుంది. ప్రతి ప్రయాణానికి ఒక మజిలీ ఉంటుంది. బహుశా ఇంకో రెండేళ్ళ తర్వాత ఈ ప్రభుత్వం ఆ వ్యతిరేకతను ఎదుర్కోవచ్చు. కాని మళ్ళీ వచ్చే కొత్త ప్రభుత్వం లోనూ ఈ తప్పుని సరంజామాను తప్పించడానికి ఒక సవరణ కావాలి. ఒక ఉద్యమం రావాలి. ఒక మార్పుకోసం ప్రయత్నం చేయాలి. ప్రభుత్వాన్ని, రాజకీయాన్ని విడదీయాలి. ఇది వినడానికి కాశీ మజిలీ కథలోని కల్పనలా అనిపిస్తుంది. ప్రయత్నస్తే, భవిష్యత్ భారతదేశం గర్వంగా నిలబడుతుంది.

ఈ కొత్త సంవత్సరం తొలి వేకువలలో ఆ ఆశను మనసు నిండా నింపుకుంటూ...ప్రతి ఒక్కరూ తమదైన బాధ్యతను గౌరవంతో, ఇష్టంతో, నిజాయితీతో నిర్వహించినట్లయితే, ప్రతి ఒక్క రాజకీయనాయకుడు తాను ఎన్నికవగానే ప్రభుత్వ ప్రతినిధిగా, కోట్ల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే వాడిగా భావించినట్లయితే...నిజంగానే మనకి మళ్ళీ స్వర్ణయుగం వస్తుంది

**నూతన సంవత్సర శుభాకాంక్షలతో...**

– నండూరి రాజగోపాల్

కథ

# మువ్వల సవ్వడి

## సలీం




యింటి బయట అంట్లన్నీ ముందరేసుకుని పిడకలు కాల్చిన బూడిద పెట్టి తోముతుందన్న మాటేగాని రమీజా మనసంతా నీళ్ళకెళ్ళే దారిలో ఓ యింటి వసారాలో కన్పించే దృశ్యం మీదే కేంద్రీకృతమైంది. దాదాపు తన వయసే ఉన్న ఆడపిల్లలు రకరకాల భంగిమల్లో కాళ్ళనూ చేతుల్ని కదుపుతూ...కళ్ళను అందంగా తిప్పుతూ ...ఆమె గొంతు ఎంత బావుంటుందో...తీయగా సాగే పాట వింటున్నట్టు... తకధిణతోం తకధిన తకతై తకధిమి తకఝుణ...నీళ్ళకోసం వెళ్తున్నప్పుడల్లా శ్రద్ధగా వినటం వల్ల పట్టుబడిన పదాలు. వాటికర్థం ఏమిటో...వింటుంటే ఎంత బావుంటుందో...చెవులకింపుగా...మరీమరి వినాలనిపించేలా...వీలైనంత తొందరగా బైటపడి కొన్ని నిముషాలసేపైనా ఆ అందమైన దృశ్యాన్ని కనులారా చూడాలనిపిస్తోంది.

"మా...పంపు దగ్గరకెళ్ళి నీళ్ళు పట్టుకు వస్తా" మూడోసారి వాళ్ళమ్మ నడిగింది.

"నకో బేటీ...నీళ్ళ కోసం అక్కడి ఆడంగులు చేసే కొట్లాటలో నువ్వు నెగ్గుకు రాలేవు. నేనే ఎలాగోలా తెచ్చుకుంటాలే".

"వారం నుంచీ నడుం నొప్పితో బాధ పడ్తూ నీళ్ళ బిందెని ఏం మోస్తావు? పర్లేదులే మా...రెండు బిందెలు తెస్తాను. ఈ రోజుకి సరి పుచ్చుకుందాం"

పన్నెండేళ్ళ తన కూతురి వైపు మురిపెంగా చూసింది గౌసియా... తల్లికి చేదోడు వాదోడు ఎప్పటి కైనా ఆడపిల్లే. నలుగురు మగపిల్లల తర్వాత పుట్టింది రమీజా. మగపిల్లలుండీ ఏమిటి ప్రయోజనం? తల్లి కష్టసుఖాల్లో పాలు పంచుకోనప్పుడు...కానీ తన భర్తకు మాత్రం మగపిల్లలంటేనే ఇష్టం. కూలినాలి చేసైనా నాలుగు డబ్బులు సంపాయించి తల్లిదండ్రుల్ని సాకేది వాళ్ళేనే అంటాడు. రేపు వాళ్ళకు మీసాలూ గడ్డాలూ వచ్చి పెళ్ళిళ్ళయ్యాక సాకుతారో మీ సావు మీరు సావండని వదిలేస్తారో ఎవరికి తెలుసు? కానీ అమ్మ మనసు మాత్రం ఆడపిల్లకే అర్థమౌతుందేమో...గౌసియా మనసు ఆర్ద్రమైంది.

"సరే వెళ్ళిరా.. అంట్లు నేను తోముతాలే. నల్లా దగ్గర నీ సహేలీలతో కబుర్లాడుతూ గంటలు గంటలు చేయకు. జల్దీ వచ్చేయి. లేకపోతే అబ్బాజాన్‌కి కోపం వస్తుంది"

"అలాగే మా" అంటూ చేతుల్ని కడిగేసుకుని, ప్లాస్టిక్ బిందె చంకలో పెట్టుకుని బైటికి

పరుగు తీసింది. ఆ యింటి సమీపానికి చేరుకునే కొద్దీ మధురమైన స్వరజతులేవో ఆమెను పట్టి బలంగా ఆ యింటి వైపుకు లాగసాగాయి. ఆ యింటి గుమ్మం దగ్గర మంత్రించినట్టు ఆగి పోయింది.

వసారాలో గోడకానుకుని బాసింపట్టు వేసుకుని కూచుని ఉంది తులసి. ఆమె ముందు తమ యింట్లో రోటీ చేయడానికి వాడే చెక్క పీటలాంటిది ఉంది. చేతిలో ఉన్న చెక్క కర్రతో దాని మీద కొడుతూ 'దిగి దిగి థం...దిగి దిగి థా...థా దిగ దిగి థా' అంటూ ఉంది. ఎదురుగా నిలబడి ఉన్న దాదాపు పదిహేను మంది ఆడపిల్లలు శరీరాల్ని రకరకాల భంగిమల్లో ఒకే శరీరమైనట్టు కదిలిస్తున్నారు.

దాన్ని కూచిపూడి నాట్యమంటారనీ ఆమె తాళం వేస్తూ పిల్లలకు జతులు నేర్పుతోందనీ ఆ పిల్లకు తెలియదు. కానీ చూస్తుంటే బావుంది. ఇంకా ఇంకా చూడాలనిపిస్తోంది. ఆమె గొంతు తేనెధారలా ఉండటం కారణమో లేక ఆ గొంతు లోంచి వెలికి వస్తున్న పదాల మాధుర్యమో లేక ఆడపిల్లల పాదాల కదలికల్లోని సౌందర్యమో ఆ పిల్లను కట్టి పడేస్తోంది.

"మాలతీ. మరలా తప్పు చేస్తున్నావు. ఏదీ ఈ సారి చేయి. ఒన్ టూ త్రీ" తులసమ్మ చెక్క పలక మీద కర్రని తాటిస్తూ చెప్పింది. ఆ పిల్లను చూసి తనకన్నా చిన్న వయసు అమ్మా యిలు కూడా ఉన్నారు అనుకుంది రమీజా.

"గుడ్...బాగా చేశావు. నాట్యమనేది గొప్ప కళ. మనసుని లగ్నం చేసి నేర్చుకోవాలి. అప్పుడే శరీర విన్యాసం లయాన్వితమౌతుంది. ఈ కళ అందరికీ అబ్బదు. ఆ నటరాజస్వామి ఆశీస్సులుండాలి. నిరంతర కృషి, పట్టుదల, అంకిత భావం ఉండాలి...అప్పుడే వంట బడ్తుంది. మీరిక్కడ ఏదైతే నేర్చుకుంటారో యింటి కెళ్ళాక సాధన చేయండి. సరదాగా నేర్చుకునేది కాదీ విద్య. భక్తితో నేర్చుకోండి. ఇష్టంతో నేర్చు కోండి" అంది తులసి.

రమీజా మరికొద్దిసేపు నిలబడి, ఆలస్య మైతే అమ్మ కోప్పడుతుందని గుర్తొచ్చి నీళ్ళకోసం పరుగెత్తింది. ఒక బిందె నీళ్ళు యింటికి మోశాక రెండో సారి వెళ్తూ మళ్ళా నాట్యం నేర్చుకుంటున్న పిల్లల్ని చూస్తూ నిలబడిపోయింది.

ఆ పిల్లని చాలా రోజులుగా గమనిస్తోంది తులసి. ఈ మధ్య ఏడాది కాలంలో తన యింటికి రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న పోరంబోకు స్థలంలో పేదవాళ్ళ గుడిసెలు వెలిశాయి. నాలుగు నెలలుగా ఆ పిల్ల కన్పిస్తూ ఉండటంతో ఎక్కడి నుంచో వచ్చి అక్కడ గుడిసె వేసుకుని ఉంటార నుకుంది.

పాఠం చెప్పటం ఆపి ఆ పిల్ల వైపు చూసి పలకరింపుగా నవ్వింది. నవ్వాలో నవ్వకూడదో తెలీని సందిగ్ధంలో రమీజా కళ్ళు విప్పార్చి ఆమె వైపు చూసింది. అబ్బ, ఎంతందమైన కళ్ళో... రెండు తెల్లటి కలువ పూలు విచ్చుకున్నట్టు... అనుకుంది తులసి. ఆ పిల్లను చూసిన ప్రతిసారీ తేటనీటి కొలనులో కదులాడే చేపల్లాంటి ఆ కళ్ళనీ, కుంచెతో గీసినట్టున్న పొందికైన పెద వుల్నీ, తీగలా కదిలే సన్నటి శరీరాన్ని అబ్బురంతో చూస్తూ ఉండిపోతుంది... అందంగా చెక్కిన శిల్పాన్ని ధూళిలో పడేసినట్టు...మాసిన బట్టల్లో పోషణలేని పిల్ల...అనుకుంది.

ఈ పిల్లకు కూచిపూడి నాట్యం నేర్పిస్తే తప్పకుండా గొప్ప కళాకారిణి అవుతుందని పించిందామెకు. ఆ కళ్ళు ముఖాభినయానికి చక్కగా పనికొస్తాయి. నీళ్ళ బిందె చంకలో పెట్టు కుని ఆ పిల్ల నడిచేటపుడు చూసిందిగా...నడుము నాట్యం చేస్తున్నట్టే ఉంటుంది. ఇంతకూ ఆ పిల్ల వూరికే చూస్తోందా లేక నిజంగానే ఆసక్తి ఉందా తెల్సుకోవాలనుకుంది.

"నీ పేరేంటి?" తులసి నవ్వుతూ అడి గింది.

"రమీజా"

"చదువుకుంటున్నావా?"

"లేదు"

"మీ నాన్నేం చేస్తాడు?"

"బేల్దారీ పని"

"ఈ పిల్లలు నేర్చుకుంటున్న దాన్ని ఏమంటారో తెలుసా?"

తెలీదని తల అడ్డంగా వూపింది.

"దీన్ని కూచిపూడి డ్యాన్స్ అంటారు"

రమీజా నమ్మలేనట్టు చూసింది. ఇంతకు ముందు అద్దెకున్న యింటి ఓనర్ యింట్లో టీవీలో చూసిందిగా. డ్యాన్స్ అంటే సినిమా పాటలకు గెంతడం కదా.

"నీకూ నేర్చుకోవాలని ఉందా?".

ఔనన్నట్టుతల వూపింది.

"ఎల్లుండి దశమి...మంచిరోజు. అప్పటి నుండి ప్రారంభిద్దాం. ఉదయం పూట రాగ లవా?" అంది తులసి,

"వుహు...పొద్దున శానా పనుంటది. మా అమ్మకి పేనం బావుండదుగా. ఇంట్లో పన్లన్నీ నేనే సేయాల. సాయంత్రం పూట వస్తాను".

"సరే".

రమీజాకి చాలా సంతోషం వేసింది. పంపు దగ్గరకెళ్ళటం కూడా మరిచిపోయి యింట్లోకి పరుగెత్తింది.

ఖాళీ బిందెతో వచ్చిన రమీజాని చూసి వాళ్ళమ్మ నీరసంగా నవ్వింది.

"నేను చెప్పానా నువ్వు నీళ్ళ దగ్గర గొడ వల్ని తట్టుకోలేవని" అంది.

ఆ మాటల్ని పట్టించుకోకుండా "మా.. నేను డ్యాన్స్ నేర్చుకుంటాను" అంది రమీజా.

"డ్యాన్సా... ఏం డ్యాన్స్?"

"పంపు దగ్గరకెళ్ళే దోవలో ఒకామె నేర్పుతూ ఉంటుందే ఆడ పిల్లలకు. అదీ మా. నేనూ నేర్చుకుంటా. ఆ యమ్మ రమ్మంది ఎల్లుండి సాయంత్రం"

గౌసియా కూడా నీళ్ళకోసం వెళ్ళి వచ్చే టప్పుడు ఒక యింటి వసారాలో పిల్లలు డ్యాన్స్ నేర్చుకోవడం చూసింది.

కూతురి కోరిక విని ఒక్కసారిగా ఆమెకు గుండెల్లో దడ మొదలైంది. "వద్దు బేటీ.. అమ్మం టివి హిందువులకి.. మనక్కాదు".

"ఎందుకు?".

"మనకది హరాం. మన ఇస్లాం ప్రకారం గానా బజానా నిషిద్ధం. డ్యాన్స్ అంటే పదిమందీ చూసేలా ఆడపిల్ల శరీరాన్ని కదిలిస్తూ ఉండాలి. మనకు అస్సలు పనికి రాదు".

"మరి మొన్న ఖాలా వాళ్ళబ్బాయి ఖత్నా అప్పుడు బ్యాండు మేళం పెట్టారుగా"

ఆ ప్రశ్నకి ఏం సమాధానం చెప్పాలో ఆమెకు తోచలేదు.

కొంత విరామం తర్వాత మళ్ళా రమీజా వాళ్ళమ్మ మెడ చుట్టూ చేతులేసి " మా...నేను డ్యాన్స్ నేర్చుకోడానికెళ్తాను. నేనింకా చిన్నపిల్ల నేగా" అంది.

"మీ అబ్బాజాన్ ఒప్పుకోడు తల్లీ"

అందామె కూతురి బుగ్గల్ని మురిపెంగా నిము రుతూ.

"మా...నువ్వే ఎలాగోలా అబ్బాజాన్ని ఒప్పించవా...యింటి పనంతా చేశాకే వెళ్తాను మా. ఐనా అబ్బాజాన్ ఎందుకు ఒప్పుకోడూ... మన ఇస్లాం ప్రకారం సారాయి తాక్కూడదు కదా. మరి అబ్బాజాన్ తాగుతాడుగా" తనకు తెలిసిన లాజిక్ ని వాడింది.

రాత్రి భోజనాలయ్యాక గౌసియా తన భర్త ఖాజా ముందు ఈ ప్రస్తావన తెచ్చింది. నిప్పు తొక్కిన కోతిలా రెచ్చిపోయాడతడు. హరామీ పనులు నేర్చుకుంటున్నావా అంటూ రమీజాని చితకబాదాడు. గౌసియా అడ్డు వెళితే ఆమెను కూడా కలిపి కొట్టాడు.

సగం రాత్రి వరకు రమీజా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూనే ఉంది. గౌసియాలోని తల్లి హృదయం తల్లడిల్లింది. ఇప్పటివరకు దాని ఏ కోరికా తీర్చలేదు. బడికెళ్తానంటే ఆడపిల్లకు చదువెందు కన్నాడు తన భర్త. పుట్టిన రోజు కొత్త బట్టలు కావాలని ఏడిస్తే ఉన్నవాటితో సర్దుకోమన్నారు. రంజాన్ అప్పుడు మగపిల్లలకు బట్టలు కొన్నారు తప్ప దాని దగ్గరకొచ్చేప్పటికి డబ్బులు లేవన్నారు. పండగ రోజు కూడా మగవాళ్ళు తినగా మిగిలిన దేకిషాకి అంటుకుని ఉన్న బగారా అన్నమే ఇద్దరికీ గతి. ఏం కోరిందని తను... చాలా చిన్న కోరిక. తన భర్తకు తెలియకుండా ఎలాగైనా సరే దాని కోరిక తీర్చాలని నిర్ణయించుకుంది గౌసియా.

ఉదయం ఖాజా పనికెళ్ళాక కూతుర్ని పిల్చుకుని తులసి దగ్గరకెళ్ళింది.

రమీజా ఒంటి మీద దెబ్బలు చూసి ఏం జరిగి ఉంటుందో తులసి అర్థం చేసుకుంది. "నా మొగుడికి తెలిస్తే సంపేత్తాడమ్మా. ఐనా దైర్నం సేసి మీ వద్దకు పంపిత్తా. దీనికి డ్యాన్స్ నేర్పండి" అంది గౌసియా.

"నీకు నిజంగా నేర్చుకోవాలని కోరిగ్గా ఉందా?" అని అడిగింది తులసి.

రమీజా తన విశాలమైన కళ్ళల్లో నీరు ఉబుకుతుండగా అవునని తల వూపింది.

గౌసియాతో "సరే. నీ భర్త పన్లో కెళ్ళాక మధ్యాహ్నం మూడింటికి పంపించు. అప్పుడు పిల్లలెవ్వరూ ఉండరు. నేను రమీజాకు ప్రత్యే కంగా నేర్పుతాను" అంది.

"వసారాలో నేర్సుకుంటుంటే ఎవరైనా సూసి నా మొగుడికి సెబ్తే మా యిద్దర్నీ మల్లా కొడ్తాడమ్మా" అంది భయంగా గౌసియా.

"నేనా విషయం ఆలోచించాలే. మా యింట్లో నేర్పుతాను. సరేనా" అంటూ నవ్వింది తులసి.

"మేం పేదవాల్లం. మీరు కొంత తగ్గించు కుని ఎంతివ్వాలో సెప్తే నేనే ఎలాగోలా సర్దుతా నమ్మా" అంది గౌసియా సిగ్గుపడుతూనే.

"నేను డబ్బులు అడగలేదుగా...అది నా కూతురులాంటిది. దాని కళ్ళలో కూచిపూడి అభినయాన్ని చూసి ఇష్టపడ్డాను. నా శిష్యురాల్ని నా అంతదాన్ని చేస్తాను. సరేనా?" అంది తులసి.

* * *

రమీజా చాలా శ్రద్ధగా నేర్చుకుంటోంది. ఆ అమ్మాయి ఏకసంథగ్రాహిలా చెప్పిన వెంటనే ఇట్టే ముద్రలు పట్టేసి చేసి చూపిస్తుంటే తులసి ముచ్చటపడిపోయింది. తన అంచనా తప్పు కాలేదు. ఈ పిల్ల గొప్ప నాట్యకారిణి అవుతుంది. ఓ నిపుణుడైన శిల్పికి మాత్రమే తెలుస్తుంది ఏ రాయిని తొలిస్తే అందమైన శిల్పం ఏర్పడు తుందో.

యింట్లో తీరిక దొరికినపుడల్లా రమీజా సాధన చేసేది. గౌసియా తన భర్త ఏ క్షణంలోనైనా హఠాత్తుగా వచ్చి చూసేస్తాడేమోనని భయపడు తూనే కూతురు చేసే నృత్యం చూసి సంతోష పడేది. ఓ ఏడాది గడిచేటప్పటికి అడువులూ, జతులూ నేర్చుకుంది. మరో ఏడాదిలో తీరికలు, ముక్తాయింపులు నేర్చుకుంది. మూడేళ్ళు పూర్త య్యేనాటికి వినాయక కౌత్వం, జతిస్వరం, భామా కలాపం, క్రిష్ణ శబ్దం, తరంగం అన్నీ నేర్చుకుంది.

"ఇంతదాకా నేర్చుకోడానికి అందరికీ కనీసం ఐదేళ్ళు పడ్తుంది తెలుసా. నువ్వు కేవలం మూడేళ్ళలో నేర్చుకున్నావు. నీకా నటరాజస్వామి ఆశీస్సులున్నాయనిపిస్తుంది" అందో రోజు తులసి.

ఆ రోజు యింట్లో అమ్మకు క్రిష్ణ శబ్దం చేసి చూపిస్తోంది రమీజా. 'యదు వంశ సుధాం బుధి చంద్ర...రత్నాకర సమ గంభీర...శతకోటి మన్మధాకార...స్వామి రారా?' అని తన మృదు మధురమైన గొంతుతో పాడుతూ నాట్యం చేస్తున్న సమయంలో ఖాజా అకస్మాత్తుగా వచ్చాడు. రమీజా అతన్ని చూసి చేస్తున్న ముద్రల్ని గాల్లోనే ఆపేసి శిల్ప సదృశంగా నిలబడిపోయింది. ఖాజా లోని కోపం అగ్నిపర్వతంలా విస్ఫోటనం చెందింది. చేతికి దొరికిన కర్ర తీసుకుని రమీ జాని చావబాదాడు. అడ్డొచ్చిన గౌసియాని కింద పడేసి కాళ్ళతో పొత్తికడుపులో తన్నాడు. రమీజా మీద కోపం చల్లారక అట్లకాడ ఎర్రగా కాల్చి నాట్య భంగిమలకు సహకరించిన చేతుల మీద పాదాలమీద వాతలు పెట్టాడు.

"మన బిరాదరీలో నా పరువు తీద్దామను కుంటున్నారా మీరిద్దరూ...ఆ డ్యాన్స్ ఏమిటో మీకు తెలుసా? నేను తెల్సుకున్నాను. హిందూ దేవుళ్ళని పూజించడానికి ఆడే డ్యాన్సట అది. పూర్వం దేవాలయాల్లో దేవదాసీలు అంటే భోగం వాళ్ళు ఆడే డ్యాన్సట. ఇది వళ్ళంతా వూపు కుంటూ ఇలా తైతక్కలాడుతుందని తెలిస్తే అసలు దీనికి పెళ్ళవుతుందా...నమాజ్ చదవాల్సిన చేతుల్లో హిందూ దేవుళ్ళని పూజించడం హరాం అని మీకు తెలియదా" అంటూ ఆ రోజంతా ఇద్దర్నీ తిడ్తూనే ఉన్నాడు.

అంతటితో వూర్కోకుండా రెణ్ణెల్లు తిర క్కుండానే రమీజాకి ఓ సంబంధం తీసుకొచ్చాడు. కుర్రాడు లారీ క్లీనర్ గా పన్చేస్తున్నాడు. ఐదు పూటలా నమాజ్ చదవకున్నా శుక్రవారం రోజు తప్పకుండా నమాజ్ చదువుతాడు. అమ్మ లేదు. నాన్న దుబాయ్ లో పని చేస్తాడు...ఇంతకంటే మంచి సంబంధం మనకు దొరకదు అన్నాడు ఖాజా.

అది ఆడవాళ్ళ అంగీకారం కోసం చెప్పిన విషయం కాదు. శాసనం... రమీజా ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండా గౌసియా అభ్యంత రాలతో ప్రమేయం లేకుండా పెళ్ళి జరిగి పోయింది. నిఖా తర్వాత తన షౌహర్తో కలిసి వెళ్ళేముందు తులసిని కల్సుకుని కన్నీటి వీడ్కోలు తీసుకుంది. "ఎక్కడ ఉన్నా సాధన చేయడం మాత్రం మానకు. నేను నా శిష్యురాళ్ళతో చాలా మందితో అరంగ్రేటం ఇప్పించాను. వాళ్ళందరి కన్నా నువ్వు నాట్యం బాగా చేస్తావు. నీ చేత డ్యాన్స్ ప్రోగ్రాం ఇప్పించాలన్న నా కోరిక ఇక ఎప్పటికీ తీరదు" అంది బాధగా తులసి. రమీజా చేతికి ఇత్తడితో చేసిన చిన్న నటరాజస్వామి విగ్ర హాన్ని తన కానుకగా ఇచ్చింది.

పెళ్ళయ్యాక కూడా రమీజా తన భర్త లారీ మీద వెళ్ళినపుడు నాట్యాన్ని సాధన చేయడం మాత్రం మానలేదు. అరంగ్రేటం చేయాలని తనకూ బలమైన కోరిక ఉండేది. ఎప్పటికైనా

సరే కొన్నివందల మంది ప్రేక్షకుల సమక్షంలో తన నాట్య కౌశలాన్ని ప్రదర్శించాలని...కాళ్ళకు గజ్జెలు కట్టుకుని స్టేజీ ముందుకి ఘల్లు ఘల్లున వయ్యారంగా నడుచుకుంటూ వచ్చి...కానీ నాన్నని తల్చుకుంటే భయమేసేది. అమ్మో... తెలిస్తే చంపి పాతరేయడం ఖాయం. చాలా రాత్రుళ్ళు ఆమెకు నిద్రలో తను నాట్యం చేస్తున్నట్టు మువ్వల రవళి విన్పించేది. ఇప్పుడూ అంతే... నిద్రలో తనకా గజ్జెల శబ్దం విన్పిస్తో ఉంటుంది. కస్తూరీ తిలకం...లలాట ఫలకే అంటూ తులసి గొంతు శ్రావ్యంగా విన్పిస్తూ.. దానికనుగుణంగా తను శరీరాన్ని కదుపుతూ... ఆంగికాభినయం చేస్తూ.

యింటిపనీ వంట పనీ పూర్తయ్యాక కొద్దిగా తీరిక దొరికితే చాలు. నేర్చుకున్న నాట్యం మర్చిపోకుండా ఉండటం కోసం సాధన చేసుకోవడం ఓ ఏడాది వరకే సాధ్య పడింది. పెళ్ళయిన ఐదేళ్ళకు ముగ్గురు పిల్లలు పుట్టారు.... ఇద్దరాడపిల్లల తర్వాత ఒక మగ పిల్లాడు... పురుళ్ళు...పిల్లల ఆలనా పాలనా.. పిల్లలు కొద్దిగా పెద్దయ్యాక మళ్ళా సాధన ప్రారంభించింది. నటరాజస్వామి విగ్రహాన్ని ఎదురుగా పెట్టుకుని దానికి నమస్కరించి నాట్యం మొదలెట్టేది. ఓ రోజు పెద్ద పిల్ల వాళ్ళ నాన్నకీ విషయం చెప్పింది. బట్టల లోపల దాచి పెట్టి ఉన్న విగ్రహాన్ని బైటికి తీసి నానా యాగీ చేసాడతను. విగ్రహారాధన చేస్తున్న నువ్వు ముసల్మానువి కాదు కాఫిర్‌వి అంటూ తిట్టాడు. పరాయి దేవుళ్ళకు మొక్కుతావా అంటూ రమీజా జుట్టు పట్టుకుని కిందపడేసి కొట్టాడు. విగ్రహాన్ని తీసుకెళ్ళి దూరంగా ఉన్న చెత్తకుప్పలో పడేసివచ్చాడు.

అతను డ్యూటీకెళ్ళిపోయాక రమీజా ఆ విగ్రహాన్ని తెచ్చుకుని కడిగి బియ్యం డబ్బాలో దాచేసింది. ఆ తర్వాత తను మళ్ళా సాధన చేసినా పిల్లలు వాళ్ళ నాన్నకు చెప్పలేదు. చెప్తే నాన్న అమ్మను కొడ్తాడని ఆ పసి హృదయాలకు అర్థమైపోయింది.

బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా వేగంగా దొర్లి పోతున్న సమయం, యాక్సిడెంట్ వల్ల భర్త మరణించడంతో ఒక్క సారిగా ఆగిపోయింది. లారీని వేగంగా నడు పుతూ పక్క నుంచి హఠాత్తుగా వచ్చిన బర్రెగొడ్డుని తప్పించబోయి చెట్టుకు గుద్దుకోవడం వల్ల డ్రైవర్తో పాటు అతని పక్కన కూచుని ఉన్న రమీజా భర్త కూడా

## అవి

కవిత

అవి చాలా తియ్యగా వుంటాయి
రుచికరంగా కూడా వుంటాయి
ఎక్కడికయినా ఎగరగలిగే
బలమయిన రెక్కలుంటాయి వాటికి
రెక్కల నిండా వాన విల్లును రిబ్బన్లుగా
కత్తిరించి చుట్టినట్లుంటాయి
దౌడు తీసే రెక్కల గుర్రంలా కూడా
వుంటాయి
సీతాకోక చిలుకలు చేతికి దొరికినట్టే దొరికి
ఎగిరిపోయినట్టుంటాయి
వేళ్ల సందుల్లోంచి బంగారపు రజను
రాలి పోతున్నట్లుంటాయవి.
దాహం వేసినప్పుడు
స్వయంగా మనకు మనమె
నీటి చెలిమె తోడి
కడుపారా నీళ్లు తాగినట్టే వుంటాయి
అందరూ దూది పింజెల్లా తేలిపోయే వారే
వాటి వీపుల మీదెక్కి
చెమట చుక్కలను ముత్యాల్లా
మార్చి చూపగలవు
పస్తుల పూట పరమాన్నం భుజిస్తున్నట్లు
భ్రమింప జేయగలవు
ఆకుపచ్చని వసంతం ప్రేమగా వచ్చి
కళ్ల మీద వాలినట్లనిపించగలవు
దుఃఖపు తడి ఆరిపోయి
సంతోషం మొలకలెత్తినట్లు
టోకరా వేయగలవు
కళ్లు తెరిచి చూసేంత ధైర్యం
చాలా మందికి వుండదు వాటి వైపుకి...
నిత్యం కవ్విస్తూ కలవరపరస్తూ
బతుకును ఒక అందమైన అబద్ధంలా
ప్రతిబింబించే గాజు పలకలవి
వాటిని కనటం మాత్రమే తెలుసు
ఎంతో మందికి
సాధించుకునే క్రమంలో
బొక్కబొర్లా పడతారు చాలా మంది...!

**చిత్తలూరి సత్యనారాయణ**

## ఆకు పచ్చని పాట

కవిత

తోటంతా తిరిగి తిరిగి
పూల రంగులు వేలి కొసలకంటించుకుని
నిస్వార్థ తరువు నేర్పిన
సుతిమెత్తని పాఠాలను నెమరేస్తూ
మోడైన చెట్టును హత్తుకున్న
చిన్న చిగురులోని
మొగ్గ తొడిగిన ఆశను చూసి
మదినిండా స్ఫూర్తి నింపుకున్నా.
మొలకెత్తిన మట్టితనంలోని
మమకారపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ
నీరూ వేరూ పంచుకుంటున్న ఊసులన్నీ
శ్రద్ధగా ఆలకించి
ఆ కలయికలోని
ఆహ్లాదపు ఆనందాన్ని శ్వాసించా
పుష్పాల లోతుల్లోకి సౌందర్యాన్ని
కనులారా గ్రోలి
ఆకుల గలగలల సవ్వడిలో
ఉయ్యాల లూగుతూ
కొమ్మలపై సరిగమలొలికించే
పిట్టల దరి
ప్రశాంతతనందుకుంటూ మై మరచా
సీతాకోకల సౌకుమార్యాన్ని
సున్నితంగా స్పృశిస్తూ
జవజీవాలలో ప్రవహింపజేసుకున్న
పరిమళాలు
మది తంత్రులను మీటుతుంటే
పత్రహరితాన్ని మనసంతా పూసుకుని
ప్రాణశక్తిని పుంజుకుంటూ
పరవశించిన సమయాన
ఒక ఆకుపచ్చని పాట
మదిలో మెరిసింది

**పద్మావతి రాంభక్త**

చనిపోయాడు.

రమీజాకు ఒక్కసారిగా లోకమంతా అంధకారమయమైపోయింది. దిక్కుతోచని పరిస్థితి. తనకా చదువులేదు. ముగ్గురు పసిపిల్లల్ని ఎలా పోషించాలో అర్థం కాలేదు. నాన్న పక్షవాతంతో మంచం పట్టడం వల్ల అమ్మానాన్న అన్నల పంచన బతుకుతున్నారు. ఇపుడు తను కూడా వెళ్ళి వాళ్ళకు మరింత భారం కావడం ఆమెకిష్టం లేదు. దుబాయ్‌లో పన్చేసే మామ ఏనాడూ తమ బాగోగుల గురించి పట్టించుకోలేదు.

సాయంత్రంపూట అరుగు మీద దిగులుగా కూచుని ఉంది రమీజా. పిల్లలు ఆరు బయట ఆడుకుంటున్నారు... తన పెద్ద కూతురు అచ్చం తనకు మల్లే నాట్య భంగిమలు పెడ్తుంటే మిగతా పిల్లలు చూసి దాన్ని అనుకరించే ప్రయత్నం చేస్తున్నారు.

రమీజాకు చప్పున బతుకు తెరువు గోచరించింది.

యింటి ముందు 'ఇక్కడ కూచిపూడి నాట్యం నేర్పబడును' అని బోర్డు రాయించి పెట్టించింది. నెల రోజులు గడిచినా ఎవ్వరూ చేరలేదు. తెలిసిన వాళ్ళందరికీ చెప్పి పెట్టింది. అయినా ప్రయోజనం శూన్యం. 'తురక పిల్లకు కూచిపూడి నాట్యం గురించి ఏం తెలుస్తుంది' అని చుట్టు పక్కల అందరూ అనుకుంటున్నారని తనతో స్నేహంగా ఉండే గిరిజ చెప్పింది. ఆమెకు పదేళ్ళ వయసున్న కూతురుంది. "నా కూతుర్ని పంపిస్తా. దానికి నేర్పు. అది చూసి మిగతా వాళ్ళు చేర్తారేమో చూద్దాం' అంది గిరిజ.

రమీజా తన వసారాలో కూచుని ఆ పిల్లకు నాట్యం నేర్పటం మొదలెట్టింది. చాలా బాగా నేర్పిస్తోందని ఆపిల్ల తన స్నేహితురాళ్ళతో చెప్పటంతో అది ఆనోటా ఈనోటా పాకి రెణ్ణెల్లు తిరిగేసరికి ఆమె శిష్య బృందం పదికి పెరిగింది. అది మరో నెలకి పాతిక్కి చేరింది. ఇపుడు రమీజా ఆ ఆదాయంతో తన కుటుంబాన్ని పోషించుకోగలుగుతోంది.

బియ్యం డబ్బాలో ఇన్నాళ్ళూ దాచి ఉంచిన నటరాజ స్వామి విగ్రహం ఇపుడు టేబుల్ మీద కొలువు తీరింది. ఉదయం లేచిన వెంటనే నటరాజ స్వామికి నమస్కరించుకోవటం ఇపుడు రమీజా దినచర్యలో భాగమైపోయింది.

**అనంతపురంలో 'చినుకు'**

ఇటీవల అనంతపురంలో జరిగిన పుస్తక మహోత్సవంలో 'చినుకు' పాల్గొన్న సందర్భంలో, అనంతపురం జిల్లా రచయితలు, సాహిత్యాభిమానులు చేసిన పలు విజ్ఞప్తులను పురస్కరించుకొని అనంతపురంలోనే 'చినుకు' పత్రిక, చినుకు పబ్లికేషన్స్ ప్రచురణలు ఇక్కడ తెలిపిన పుస్తకాలయంలో లభ్యమయ్యే ఏర్పాటు చేయడం జరిగింది.

చందాదారులు కాని సాహిత్యాభిమానులకు ఈ చిరునామాలో 'చినుకు' మాసపత్రిక, ప్రచురణలు ప్రతినెల లభ్యమవుతాయి. సాహిత్యాభిమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరుతున్నాము.

*పద్మ బుక్‌స్టాల్*
*కాలేజీ రోడ్, అనంతపురం 515 001*
*ఫోన్ : 08554 223948*

## శ్రీమతి కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం - 2017

**శ్రీమతి కొలకలూరి విశ్రాంతమ్మ పురస్కారం ప్రారంభించాక ఇది పదో సంవత్సరం. ఇంత వరకు నవలకు ( 2008,2011, 2014), నాటకానికి (2009,2012,2015), పరిశోధనకు (2010,2013,2016) ఈ పురస్కారం ప్రదానం చేసిన విషయం తెలిసిందే.**

ఈ సంవత్సరం గ్రంథ రూపంలో ముద్రిత నవలకు పురస్కారం ప్రదానం చేయడం జరుగుతుంది. కడచిన మూడు సంవత్సరాలలో అంటే జనవరి 2014 నుంచి డిసెంబర్ 2016 వరకు ముద్రితమైన తెలుగు నవల పురస్కారానికి పరిశీలింపబడుతుంది. ఇందుకోసం రచయితలు గాని, ప్రచురణ కర్తలుగానీ మూడేసి ప్రతులు పరిశీలనార్థం పంపగోరుతున్నారు. ఒకే రచయితవి ఒకటి కంటే ఎక్కువ పరిశోధన గ్రంథాలు ఎన్నయినా పంపవచ్చు.

పురస్కారంగా రూ. 10,000/- నగదు, శాలువా, మొమెంటో ప్రదానం చేస్తారు. నవలా గ్రంథం 18 జనవరి 2017 లోగా పంపవలసి వుంటుంది. ఫిబ్రవరి 15, 2017లోగా పురస్కార ప్రకటన జరుగుతుంది. ఫిబ్రవరి 26, 2017న హైదరాబాద్‌లో జరిగే సభలో పురస్కారం ప్రదానం చేస్తారు.

ముద్రిత నవలలు పంపవలసిన చిరునామా : ఆచార్య కొలకలూరి సుమకిరణ్, ప్రొఫెసర్, ఆంగ్లశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502, సెల్ : 99635 64664

## ఒకవేళ 'చినుకు' మీకు చేరకపోతే...!

**'చినుకు' సంచిక ఏనెలలోనైనా చందాదారులకు అందని అరుదైన సందర్భాలలో దయచేసి వెంటనే 98485 36113 ని సంప్రదించగలరు...లేదా మెసేజ్ పంపగలరు. ఆయా చందాదారుల చిరునామాలను సరిచూసి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయగలము. అపార్ట్‌మెంట్లలో నివసించే చందాదారులు ఈ విషయంలో తగిన ముందు జాగ్రత్తలు తీసుకోగలరు.**

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Chinuku+January+2017

* * *